క్లుప్తంగా

నిధులు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు గంగాదేవి

కొత్తచెరువు: మండలంలోని ప్రభుత్వ బడులకు ప్రహరీ లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలు చోటుచేసుకుంటున్నాయని జెడ్పీటీసీ సభ్యురాలు గంగాదేవి తెలిపారు. బుధవారం అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ స్థాయి సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. మండలంలో నెలకొన్న పలు సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల సంఖ్య పెరుగుతోందని, అందుకు సరిపడా డాక్టర్లను నియమించాలన్నారు. ప్రస్తుతం ఒకే డాక్టర్ ఉండడం వల్ల రోగులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.

ఘనంగా పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ట



చెన్నేకొత్తపల్లి: మండలంలోని యర్ర జిన్నన్నగారిపల్లి (కొండకిందపల్లి) గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో బుధవారం పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ట ఘనంగా జరిగింది. ఉదయం వేదపండితులు ప్రత్యేక పూజలు , హోమాలు చేశారు. కార్యక్రమానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. అనంతరం భక్తులకు అన్నదాన నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ముదిగుబ్బ: మండల కేంద్రం సమీపంలోని కాశిరెడ్డి నాయన ఆశ్రమం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు గాయపడ్డారు. వివరాలు.. బుక్కపట్నం మండలం నార్సింపల్లికి చెందిన సతీష్‌నాయక్, సవిత ద్విచక్ర వాహనంలో అనంతపురం బయలుదేరారు. కాశిరెడ్డి నాయన ఆశ్రమం వద్ద రోడ్డుకు అడ్డంగా చిన్నారి రావడంతో ఒక్కసారిగా వాహనం అదుపు తప్పింది. భార్యాభర్తలు కింద పడంతో గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం 108లో ముదిగుబ్బకు తరలించారు.

ముస్లింల శ్మశాన వాటికకు స్థలం కేటాయింపు



స్థలం కేటాయిస్తూ ఉత్తర్వులు అందజేస్తున్న తహసీల్దార్ దేవేంద్ర నాయక్

నల్లమాడ: ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి చొరవతో మండలంలోని పులగంపల్లి ముస్లింల శ్మశాన వాటికకు స్థలం కేటాయించారు. గ్రామంలో 200 ముస్లిం మైనార్టీ కుటుంబాలున్నాయి. శ్మశాన వాటిక లేకపోవడంతో అంత్యక్రియలు చేపట్టేందుకు స్థలం లేక ముస్లింలు ఇబ్బందులు పడేవారు. ఈ విషయాన్ని పులగంపల్లి ముస్లింలు ఇటీవల ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే తక్షణమే స్పందిస్తూ స్థలం కేటాయించాలని తహసీల్దార్ దేవేంద్రనాయక్‌కు సూచించారు. పులగంపల్లి రెవెన్యూ పొలం సర్వే నంబర్ 119లో 0.97 సెంట్ల స్థలాన్ని శ్మశాన వాటికకు కేటాయిస్తూ బుధవారం తహసీల్దార్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి సుబ్బారావు

కదిరి అర్బన్: అధికారులంతా ప్రభుత్వ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులో ఉండాలని మండల స్పెషలాఫీసర్, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న కాలనీల్లో నిర్మాణాలను వేగవంతం చేసేలా లబ్ధిదారులను చైతన్యపరచాలన్నారు. అర్హులందరికీ ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేస్తోందన్నారు. అనంతరం పలు శాఖల ప్రగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వచ్చే సమావేశంలో ప్రతి శాఖకు సంబంధించి పూర్తిస్థాయి ప్రగతి నివేదికలతో హాజరు కావాలని ఆదేశించారు. అంతకుముందు వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లోని వేరుశనగ విత్తనశుద్ధి కేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏడీఏ సత్యనారాయణ, ఏఓ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

- రోడ్లు, సచివాలయ భవనాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



నల్లమాడ సచివాలయం వద్ద మొక్క నాటుతున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం పర్యటించిన ఆయన నూతనంగా నిర్మించిన పలు రోడ్లు, గ్రామ సచివాలయ భవనాలను ప్రారంభించారు. అనంతరం నల్లమాడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మాట్లాడారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. గ్రామ, వార్డు సచివాలయాలకు అన్ని వసతులతో పక్కాభవనాలు నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. అందులో పనిచేసే సిబ్బందికి, ప్రజలకు మంచి వాతావరణం కల్పించడం జరిగిందన్నారు. పుట్టపర్తి నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటికే చాలా రోడ్లు నిర్మించామన్నారు. ఒకటీ అర మిగిలి పోయి ఉంటే వాటిని కూడా త్వరలోనే పూర్తి చేస్తామన్నారు.

అధిక మొత్తంలో పరిహారం

పుట్టపర్తి నియోజకవర్గంలోని ఓడీ చెరువు, పుట్టపర్తి, నల్లమాడ మండలాల మీదుగా గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే (ఆరు వరుసల రోడ్డు) నిర్మాణం చేపడుతున్నందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి నియోజకవర్గ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఇందుకోసం భూములు కోల్పోయిన రైతులకు వారు ఆశించిన దానికంటే అధిక మొత్తంలో పరిహారం మంజూరు చేయడంతో ఆ రైతుల కళ్లలో ఆనందం కనిపిస్తోందన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మండలంలోని సీ.రెడ్డివారిపల్లి, ఎన్.ఎనుమలవారిపల్లి, దేవగుళ్ల, గూడమేకలపల్లి, కాయలవాండ్లపల్లి, బొగ్గిటివారిపల్లి గ్రామాలకు నూతనంగా నిర్మించిన తారు, సిమెంట్ రోడ్లను ప్రారంభించారు. ఒక్కోటి రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన చారుపల్లి, రెడ్డిపల్లి, నల్లమాడ గ్రామ సచివాలయ భవనాలకు ఎమ్మెల్యే పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు తన దృష్టికి తెచ్చిన సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే అక్కడికక్కడే చర్యలు తీసుకున్నారు. మీసాలవాండ్లపల్లి నుంచి పంచాయతీ కేంద్రం యర్రవంకపల్లి వరకు తారు రోడ్డు నిర్మించాలని పలువురు కోరారు. మీసాలవాండ్ల పల్లిలో ఫ్లోరైడ్ అధికంగా ఉన్నందున ఆర్ఓ ప్లాంట్ మంజూరు చేయాలని గ్రామస్తులు విన్నవించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డీఈ మధుప్రకాష్ రెడ్డి, ఎంపీడీఓ రామచంద్రారెడ్డి, పీఆర్ ఇంజినీర్ గురురాజ్ గుప్తా, జిల్లా వ్యవసాయ సలహా బోర్డు చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, ఎంపీపీ దుంగావత్ సునీతాబాయి, వైస్ ఎంపీపీ కే.సూర్యనారాయణ, సర్పంచులు ప్రమీలమ్మ, ప్రసాద్, మాసే రెడ్డెమ్మ, మాజీ సర్పంచులు ప్రతాప్‌రెడ్డి, రవిచంద్రారెడ్డి, ఎంపీటీసీలు భాస్కర్ రెడ్డి, రాధయ్య, శివారెడ్డి, మహబూబ్‌బాషా, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కుళ్లాయినాయక్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి టీడీ కేశవరెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొరకల రమణ, సహకార సంఘం అధ్యక్షుడు ఏ.గంగిరెడ్డి, నాయకులు దుద్దుకుంట వెంకటరెడ్డి, అశ్వర్థనారాయణ, లక్ష్మీనారాయణ, దుద్దుకుంట సురేంద్రరెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

పథకాల పురోగతిపై సమీక్ష



అధికారులతో చర్చిస్తున్న మండల ప్రత్యేకాధికారి రామకృష్ణ

ధర్మవరం రూరల్: బత్తలపల్లి మండలంలో వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, పురోగతి, ప్రజా సమస్యలు తదితర అంశాలపై మండల ప్రత్యేకాధికారి రామకృష్ణ అధికారులతో సమీక్షించారు. బుధవారం బత్తలపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయ భవనాల నిర్మాణాలు, నాడు–నేడు అభివృద్ధి పనులు, పక్కా గృహాలు, పౌష్టికాహారం పంపిణీ, తాగునీటి సమస్యలు, ఖరీఫ్‌లో విత్తన వేరుశనగ పంపిణీపై చర్చించారు. కార్యక్రమంలో తహసీల్దార్ యోగేశ్వరీ దేవి, ఎంపీడీఓ శ్రీదేవి, పీఆర్ ఇంజినీర్ రమణయ్య, ఎంఈఓ చాముండేశ్వరి, ఏఓ ఓబిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ వరలక్ష్మి, ఏపీఎం సుదర్శన్ రాజు, ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

నూతన హంగులతో కార్యాలయాల నిర్మాణం



మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

నల్లచెరువు: మండల కేంద్రంలో రూ.16.50 లక్షల వ్యయంతో ఆధునీకీకరించిన మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని ఆధునిక సౌకర్యాలతో నిర్మించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని ప్రభుత్వ కార్యాలయాలను నూతన హంగులతో నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి సచివాలయం పరిధిలో అద్భుతమైన ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించి ప్రభుత్వ సేవలను గ్రామీణ ప్రాంతాలకు విస్తరించామన్నారు. అన్ని వసతులతో కూడిన ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆధునీకీకరించిన కాంట్రాక్టర్ సానే హరినాథ్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ రమణారెడ్డి, ఎంపీడీఓ శకుంతల, వైస్ ఎంపీపీలు నారాయణస్వామి, రామలక్ష్మమ్మ, సర్పంచులు పంచరత్నమ్మ, యూసుఫ్, గంగాదేవి, ఎంపీటీసీలు భాస్కర్‌రెడ్డి, సుమియా, నరసింహారెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ నాగభూషణ, సింగల్ విండో అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, డైరెక్టర్ ఆదిమూర్తి, టెంపుల్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మాజీ చైర్మన్ ఆనంద్‌రెడ్డి, మాజీ సర్పంచులు రవికుమార్ రెడ్డి, అక్బర్, నాగేంద్ర, అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ ముష్తఫా, జేసీఎస్ కన్వీనర్ రాజశేఖర్, మాజీ ఎంపీటీసీ రమణ, నాయకులు బట్టీ హైదర్ వలి, కె.రమణారెడ్డి, సమీవుల్లా, రఫీ, వెంకటరెడ్డి, పెద్ద మౌలాలి, నాసు నరసింహులు, ఆకుల శ్రీనివాసులు, గుత్తా మంజునాథ, వై.రమణారెడ్డి, చిన్నపల్లి హరి, సూర్యనారాయణ రెడ్డి, ఆనంద్ రెడ్డి, పోలం సూర్యశేఖర్ రెడ్డి, ఎం.కృష్ణారెడ్డి, సిద్దారెడ్డి, పీఆర్ శంకర్, ఆది, టైలర్ రామాంజి, మల్లిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు పథకాలు అందించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



30వ వార్డులో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: ప్రాంతాలు, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక 30వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వార్డులో ఇంటింటికీ తిరుగుతూ పేదలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాన్ని వివరించారు. వార్డు ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా వార్డులో సీసీరోడ్లు, డ్రైన్‌లు లేకపోవడంతో చిన్నపాటి వర్షం వచ్చిందంటే ఇళ్లలోకి నీరు చేరుతోందన్నారు. ఇందుకు ఎమ్మెల్యే కేతిరెడ్డి స్పందిస్తూ.. వార్డులో ఇప్పటికే డ్రైన్‌లు నిర్మించడం జరుగుతోందని, డ్రైన్‌ల నిర్మాణం పూర్తయిన వెంటనే సీసీరోడ్లు వేయిస్తామన్నారు. మరికొంత మంది సాంకేతిక తప్పిదాల కారణంగా ఇంటి పట్టాలు, పెన్షన్లు రాలేదని చెప్పారు. సచివాలయ సిబ్బంది, హౌసింగ్ అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే.. సమస్యలను పరిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా ధర్మవరం పట్టణంలో 12 వేలకు పైగా ఇళ్లులేని పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. జగనన్న కాలనీలలో 1.50 సెంట్ల స్థలంలో మగ్గంషెడ్ నిర్మాణానికి అనుకూలంగా ప్రభుత్వం ఇళ్లు నిర్మిస్తోందన్నారు. అంతేకాక వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ఏటా డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు ఆర్థిక సాయం అందించడం జరుగుతోందన్నారు. పేద ప్రజలకు ఏ ఇబ్బంది లేకుండా అమ్మ ఒడి, జగనన్న విద్యా, వసతి దీవెన పథకాల ద్వారా విద్యార్థుల చదువులకు సాయం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు ఎర్రగుంట భాగ్యలక్ష్మి, పెనుజూరు నాగరాజు, వార్డు కౌన్సిలర్ బోయ రమాదేవి, వైఎస్సార్ విద్యార్థి విభాగ్ రాష్ట్ర కార్యదర్శి అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

ముదిగుబ్బ: ముక్తాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త ఆంజినేయులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి బుధవారం ఆంజినేయులను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్య ఖర్చులకు రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ ఇందుకూరి నారాయణరెడ్డి, కిరణ్ మోహన్‌రెడ్డి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ

కనగానపల్లి: ప్రజాస్వామ్యానికి లోబడి ప్రజాప్రతినిధులతో కలసి ప్రభుత్వ అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. ఎంపీపీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో శాఖల వారీగా అధికారులు వారి ప్రగతి నివేదికలను చదివి వినిపించారు.

అధికారులపై ఆగ్రహం

ఆర్అండ్‌బీ, అటవీశాఖ అధికారుల పనితీరుపై పలువురు ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో పలుచోట్ల రహదారుల పక్కన ఉన్న ఆర్అండ్‌బీ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నా ఆ శాఖ అధికారులు కన్నెత్తి చూడటం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనివల్ల పలు గ్రామాల్లో ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయని ఆర్అండ్‌బీ జేఈ సింధూర దృష్టికి తీసుకెళ్లారు. అటవీశాఖ అధికారిణి గౌతమి స్థానిక ప్రజాప్రతినిధులకు కనీస గౌరవం ఇవ్వకుండా తన ఇష్టానుసారం పనిచేస్తున్నారని వైస్ ఎంపీపీ నరసింహారెడ్డితో పాటు దాదులూరు, కుర్లపల్లి సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కుర్లపల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలోని చెట్లకు నిప్పు పెట్టి నాశనం చేస్తున్నా పట్టించుకోకపోవటంతో పాటు కలప అక్రమ రవాణాకు సహకరిస్తున్నారని ఆరోపించారు. అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం కేటాయించిన మండల గ్రాంట్ నిధుల వినియోగంపై తగరకుంట ఎంపీటీసీ క్రిష్టారెడ్డి పంచాయరాజ్ అధికారులను ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, వైస్ ఎంపీపీ పద్మావతి, ఈఓఆర్డీ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

చేనేత ఐక్య వేదిక సంఘం జిల్లా అధ్యక్షుడిగా రవివర్ధన్

ధర్మవరం రూరల్: జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘం సత్యసాయి జిల్లా అధ్యక్షుడిగా చట్టా రవివర్ధన్ ఎంపికయ్యారు. జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీలూరి రుషింగప్ప తనకు నియామక ఉత్తర్వులు అందిచారని రవివర్ధన్ తెలిపారు. చేనేత కార్మికులకు ప్రభుత్వం నుంచి అందే పథకాలను సక్రమంగా అందేలా కృషి చేస్తానన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కనగానపల్లి: మండలంలోని తల్లిమడుగుల సమీపంలో బుధవారం కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వెంకటరమణ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ హనుమంతరెడ్డి తెలిపారు. అతని వద్ద నుంచి 25 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

ఫీజు చెల్లింపునకు తుది గడువు 22

ధర్మవరం రూరల్: ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు రూ.50 అపరాధ రుసుముతో ఈనెల 22వ తేదీ వరకూ ఫీజు చెల్లించవచ్చని ఎంఈఓ సుధాకర్ నాయక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 2వ తేదీ నుంచి 10వ తేదీ వరకూ జరుగుతాయన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

ముదిగుబ్బ: మండల కేంద్రం సమీపంలోని కాకతీయ దాబా వద్ద బుధవారం బండల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి రోడ్డుకు అడ్డంగా పడింది. ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు తాడిపత్రి నుంచి బండలు ముదిగుబ్బకు తీసుకొస్తుండగా ట్రాక్టర్‌కు ఉన్న ఉక్కు విరిగిపోవడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. అదృష్ట వశాత్తూ ఎవరూ గాయపడక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

కూలీల సంఖ్య పెంచాలి

గాండ్లపెంట: ఉపాధి పనులకు కూలీల సంఖ్య పెంచేలా సాంకేతిక, క్షేత్ర సహాయకులు చర్యలు తీసుకోవాలని ఏపీఓ మంజునాథ్ తెలిపారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో బుధవారం సాంకేతిక, క్షేత్ర సహాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత వారంలో చేపట్టిన పనులు, కొలతలు, కూలీల సంఖ్య అంశాలపై చర్చించారు. ఇంకా కూలీల సంఖ్య పెంచాలని.. అదే సమయంలో వారికి నిబంధనల మేరకు సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. మండలంలోని చిన్న, సన్న కారు రైతులు పండ్ల మొక్కల పెంపకంపై దృష్టి సారించేలా కృషి చేయాలని కోరారు. ఇప్పటి దాకా 36 మంది రైతులు పండ్ల మొక్కల పెంపకానికి దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఈసీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

కురుబ యువజన సంఘం అధ్యక్షుడిగా బిల్లే ముత్యాలు

కనగానపల్లి: రాప్తాడు నియోజక వర్గ కురుబ యువజన సంఘం అధ్యక్షుడిగా మండలంలోని తల్లిమడుగులకు చెందిన బిల్లే ముత్యాలును నియమించారు. బుధవారం జిల్లా అధ్యక్షుడు పామాల రాజశేఖర్ నుంచి నియామక పత్రాన్ని అందుకున్నట్లు ఆయన తెలిపారు.

ఆర్‌బీకేలకు చేరిన విత్తన వేరుశనగ

తనకల్లు: ఖరీఫ్‌లో సాగు చేసేందుకు సబ్సిడీ విత్తన వేరుశనగ రైతు భరోసా కేంద్రాలకు చేరినట్లు వ్యవసాయాధికారి శ్రీహరినాయక్ తెలిపారు. బుధవారం తనకల్లు–1 ఆర్‌బీకేలో వేరుశనగ కాయల నాణ్యతను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. మండలానికి మొత్తం 4,581 క్వింటాళ్ల వేరుశనగను ప్రభుత్వం కేటాయించినట్లు తెలిపారు. విత్తన వేరుశనగ కావాల్సిన రైతులు ఆయా ఆర్‌బీకేలలో 18వ తేదీ నుండి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ సయాజ్, పాల్గొన్నారు.

వేరుశనగకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

తాడిమర్రి/తలుపుల/నల్లచెరువు/గాండ్లపెంట: విత్తన వేరుశనగకు రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తాడిమర్రి ఏఓ రమాదేవి, తలుపుల ఏఓ షాదాబ్, నల్లచెరువు ఎంఏఓ భారతి, గాండ్లపెంట ఏఓ లక్ష్మీప్రియ బుధవారం వేర్వేరు ప్రకటనలో తెలిపారు. అర ఎకరానికి 30 కిలోలు, ఎకరాకు 60 కిలోలు, ఒక ఎకరా పైన ఉన్న రైతులకు 90 కిలోలు ఇవ్వడం జరుగుతుందన్నారు. 30 కిలోల బస్తా పూర్తి ధర రూ.2,790, సబ్సిడీ రూ.1,116 పోనూ రూ.1,674 చెల్లించాల్సి ఉంటుందన్నారు. మూడు బస్తాలకు పూర్తి ధర రూ.8,370 కాగా.. సబ్సిడీ రూ.3,348 పోనూ రైతులు రూ.5022 చెల్లించాల్సి ఉందన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలోనే రైతులు ఎన్ని బస్తాలు కావాలో నగదు చెల్లించాలని చెప్పారు.

వాల్మీకి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

నల్లమాడ: శ్రీసత్యసాయి జిల్లా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో వాల్మీకి, బోయ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు ఈనెల 27న ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు ఆ సంఘం నాయకుడు ఈరాతి నాగరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో ప్రభుత్వ పాఠశాలలో చదివి 450కి పైగా మార్కులు, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు అయితే 475కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. అలాగే ఇంటర్‌లో ప్రభుత్వ కళాశాలలో చదివిన విద్యార్థులు 800 పైన, ప్రైవేట్ కళాశాల విద్యార్థులు 850 పైన మార్కులు సాధించి ఉండాలన్నారు. ఈనెల 23లోపు బయోడేటా, పది, ఇంటర్ మార్కుల జాబితాలను 9490196605, 9985522703, 9491990056 నంబర్లకు వాట్సాప్‌లో పంపించాలన్నారు.

గిరిజన మహిళకు న్యాయం చేయాలి

కదిరి అర్బన్: మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లిలో గిరిజన మహిళ బుఖ్యా రాధమ్మ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఎస్ఐ హేమంత్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ సూర్యనారాయణకు బంజారా సంక్షేమ సేవా సంఘం నాయకులు బుధవారం వినతిపత్రం సమర్పించారు. గిరిజన మహిళ ఇంట్లోకి చొరబడి ఆమె కూతురితో అసభ్యంగా మాట్లాడటం తగదన్నారు. ఎస్ఐపై చర్యలు తీసుకుని గిరిజన మహిళకు న్యాయం చేయకపోతే పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బంజారా సంక్షేమ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్, కదిరి మండల అధ్యక్షుడు ఆనంద్‌నాయక్, శంకర్‌నాయక్, చంద్రమోహన్ నాయక్, పీరునాయక్ పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాల పంపిణీ

తాడిమర్రి: తాడిమర్రి, పెద్దకోట్ల, కునుకుంట్ల, దాడితోటచ పిన్నదరి, నార్సింపల్లి, ఎం.అగ్రహారం, చిల్లవారిపల్లి, చిన్నచిగుళ్లరేవు తదితర గ్రామాల్లో బుధవారం మిడ్‌లెవల్ ప్రొవైడర్లు, ఏఎన్ఎంలు చిన్నారులకు పోలియో చుక్కలు, డీపీటీ, నిమోనియా తదితర టీకాలను వేశారు.


సమస్యలపై సత్వరం స్పందించండి



మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి రామాంజనేయులు

తాడిమర్రి: మండల సమస్యలపై సత్వరమే స్పందించాలని డ్వామా పీడీ, మండల ప్రత్యేక అధికారి రామాంజనేయులు అధికారులను ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండలస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అవసరం అనుకుంటే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ లక్ష్మిని ఆదేశించారు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని ట్రాన్స్‌కో ఏఈ విజయ్ శేఖర్‌కు సూచించారు. వీధిలైట్లు, పారిశుద్ధ్యం సమస్యలు తలెత్తకుండా గ్రామ కార్యదర్శులను అప్రమత్తం చేయాలని ఈఓపీఆర్డీ కామాక్షికి సూచించారు. ఉపాధిహామీ ద్వారా చీనీ, మామిడి, జామ, సపోటా తదితర పండ్లతోటల సాగుకు చిన్న, సన్న కారు రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ సంజీవరెడ్డి, వైద్యాధికారి మహేంద్రనాథ్, సిరికల్చర్ అధికారి బీవీ రమణ, మండల ఏఈ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి



ఎమ్మార్సీలోని పాఠ్య పుస్తకాలను పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి రమేష్

ఓడీ చెరువు: అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని జిల్లా హ్యాండ్‌లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ ఆఫీసర్, మండల ప్రత్యేకాధికారి రమేష్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్, వ్యవసాయ, విద్య, వైద్య, శిశు సంక్షేమం శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల పనితీరుపై సమీక్షించారు. మండలంలో చేపట్టిన జగనన్న గృహ నిర్మాణాలు, నాడు–నేడు ద్వారా చేపట్టిన పాఠశాలలు, అంగన్‌వాడీ భవనాల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి పనులకు కావాల్సిన నిధులు పుష్కలంగా ఉన్నాయన్నారు. అనంతరం ఎంపీడీఓ పోలప్ప, ఎంఈఓ ఖాదర్‌వలి బాషాతో కలసి ఎమ్మార్సీ కార్యాలయంలో నిల్వ ఉంచిన జగనన్న విద్యాకానుక కిట్లను పరిశీలించారు. స్కూల్ మెటీరియల్, షూ, బెల్టుల నాణ్యతను తనిఖీ చేశారు. నాణ్యతలో రాజీపడొద్దని పాఠశాలల పునఃప్రారంభానికి ముందే అన్ని పాఠశాలలకు మెటీరియల్ చేరవేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ హరిప్రసాద్‌రెడ్డి, ఎంఈఓ ఖాదర్‌వలిబాషా, వ్యవసాయశాఖ అధికారి ఇలియాజ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయమ్మ, ఉపాధ్యాయులు ఓబులేసు, రామాంజినేయులు, రామలక్ష్మి పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు

కదిరి అర్బన్: గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి హజ్ యాత్రకు వెళ్తున్న ముస్లిం సోదరులపై పడుతున్న అదనపు భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించేలా చర్యలు తీసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి స్థానిక ముస్లింలు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం లీగల్ సెల్ రాష్ట్ర నాయకుడు లింగాల లోకేశ్వరెడ్డి కార్యాలయంలో పార్టీ పట్టణాధ్యక్షుడు బాహద్దీన్ మాట్లాడారు. సీఎం జగన్ ముస్లింల పక్షపాతిగా నిలిచారన్నారు. రాష్ట్రం నుంచి 1813 మంది హజ యాత్రకు వెళ్తున్నారని తెలిపారు. అదనపు భారం మొత్తం రూ.14.51 కోట్లు సెంట్రల్ హజ్ కమిటీకి చెల్లించడం జరిగిందన్నారు. సమావేశంలో కౌన్సిలర్ ఎంఎస్ ఫయాజ్‌అలీఖాన్, న్యాయవాది అబ్దుల్ రహిమాన్, ఖితాబుద్దీన్, మౌలా తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీయడమే లక్ష్యం

ఎన్పీకుంట: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు వేసవి విజ్ఞాన శిబిరం దోహదపడుతుందని గ్రంథాలయ అధికారిణి శాంతమ్మ అన్నారు. బుధవారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చెప్పడం, చెప్పించడం, చిత్రలేఖనం, నాట్యంపై పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. అలాగే ఇంగ్లిష్ వ్యాకరణంపై తరగతులు నిర్వహించారు. శిబిరానికి 25 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు.